ఆలస్యం.. అడ్డంకులు

కోటలో ప్రధాన రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ఆలస్యంగా సాగుతుండడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రోడ్డు పనులు ప్రారంభించి నెలరోజులు దాటినా పురోగతి కనిపించడం లేదు. వ్యాపార కేంద్రమైన కోటకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అన్నీ వాహనాలు ఇదే రోడ్డుపై వెళ్లాల్సి రావడం, పూర్తి కాని రోడ్డు, దుమ్ముధూళితో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

– కోట



ఒక వైపే వేసిన సీసీ రోడ్డు

- కోటలో నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు
- పనుల ఆలస్యంపై ప్రజల్లో వ్యతిరేకత
- స్తంభించి పోతున్న ట్రాఫిక్
- అధికారుల్లో కనుపూరు జాతర టెన్షన్

గత ఏడాది వర్షాలకు కోట క్రాస్‌రోడ్డు నుంచి కోట వరకు రోడ్డు దుస్థితికి చేరింది. రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డు దుస్థితిపై విమర్శలు రావడంతో రోడ్డు నిర్మాణానికి అధికారులు రూ.1.80 కోట్లు మంజూరు చేశారు. కోట ఆర్టీసీ సెంటర్ నుంచి ఎన్‌సీఆర్ నగర్ వరకు 450 మీటర్లు సీసీ రోడ్డు, అక్కడ నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు 1350 మీటర్లు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. సంక్రాంతికి రోడ్డు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు.

అయితే పనులు ఆలస్యంగా చేస్తున్నారు. ఆర్టీసీ సెంటర్ నుంచి ఎన్‌సీఆర్ నగర్ వరకు ఒక వైపు మాత్రమే సీసీ రోడ్డు వేసి వదిలేశారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం ఉన్న రోడ్డును కూడా పూర్తిగా తవ్వేయడంతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు.

కనుపూరు జాతర టెన్షన్

ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న కనుపూరు ముత్యాలమ్మ జాతరకు ట్రాఫిక్‌ను ఎలా నియంత్రించాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కనుపూరు జాతరకు వచ్చే భక్తులు కోట మీదుగా ప్రయాణం సాగించాల్సి ఉంది. తమిళనాడుతోపాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వందలాది వాహనాలు కోట మీదుగానే వెళ్లాల్సి ఉంది. అనుకున్న గడువులోగా రోడ్డు నిర్మాణం పూర్తికాక పోవడంతో రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



కోటలో సీసీరోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. బజారులోకి వాహనాలు వెళ్లే మార్గం లేక ఇరుకైన రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి వేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. – నారాయణ, కోట

దుమ్ముధూళితో అవస్థలు



రోడ్డు నిర్మాణం కోసం కోట నుంచి కోట క్రాస్‌రోడ్డు వరకు కిలోమీటరు మేర రోడ్డును పూర్తిగా తవ్వేశారు. పనులు చేపట్టడం ఆలస్యం కావడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ముధూళితో ఇబ్బందులు పడుతున్నాం. కోటకు వెళ్లాలంటేనే జనం హడలి పోతున్నారు. సీసీ రోడ్డు ఒక వైపు పూర్తి చేసి వదిలేశారు. బీటీ రోడ్డు పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. – మధు, విద్యానగర్

ప్రత్యామ్నాయం చూపుతాం



కనుపూరు జాతరకు వచ్చే వాహనాలు కోట మీదుగా వెళ్లే అవకాశం లేదు. వెంకన్నపాళెం మీదుగా వాహనాలను దారి మళ్లించే విధంగా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నాం. దీనిపై ఇప్పటికే ఆర్టీసీ, పోలీస్ అధికారులతో చర్చలు జరిపాం. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నిర్ణయం తీసుకుంటాం.

– జయజయరావు, తహశీల్దార్, కోట







కోటలో ప్రధాన రహదారి నిర్మాణ పనులు, ఒక వైపే సీసీ రోడ్డు వేసి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్న జనం, వాహనాలు వెళ్లే సమయంలో రేగుతున్న దుమ్ము

క్లుప్తంగా

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మున్సిపల్ పాలకవర్గ సమావేశం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన బుధవారం జరుగుతుందని కమిషనర్ షేక్ ఫజులుల్లా మంగళవారం తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని కమిషనర్ కోరారు.

ఆంగ్ల ఉపాధ్యాయినికి సత్కారం



రజనిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

వెంకటగిరి రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు రజనిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని స్వర్ణలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ఈటీఏ ఆధ్వర్యంలో జరిగిన అవార్డును రజని సాధించడంపై అభినందించినట్లు తెలియజేశారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

గూడూరు రూరల్: చెన్నూరు గ్రామంలోని అరుంధతీ వాడలో శ్రీమాతా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు మూడు రోజుల నుంచి అమ్మవారికి చద్ది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అమ్మవారికి విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

20న విద్యుత్ అదాలత్

గూడూరు రూరల్: ఈ నెల 20వ తేదీన కోట మండలం చెందోడు గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించే విద్యుత్ అదాలత్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం డివిజనల్ ఈఈ నరేంద్రరెడ్డి తెలిపారు. గూడూరు రూరల్ పరిధిలోని నెలటూరులో ఉన్న ఆయన కార్యాలయంలో మాట్లాడారు. కోట ప్రాంతంలోని విద్యుత్ సమస్యలను అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

రాపూరు: విద్యార్థులు వేసవిని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని వేపినాపి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రమీల రాజకుమారి సూచించారు. కండలేరు గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు మంగళవారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

ఆర్‌పీఐను బలోపేతం చేయాలి

చిల్లకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు గౌడ్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను ఆ పార్టీ నాయకులు కలిశారు. డాక్టర్ మిరియాల వెంకటరమణయ్య, ఈదూరు మనోహర్, షేక్‌బాషా, కనుపూరు రాజా, హరి, సుశాంత్, భూషణ్, పృధ్వీ పాల్గొన్నారు.

అదుపు తప్పి టిప్పర్ బోల్తా

రాపూరు: సిద్ధవరం గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున ఏర్పేడు నుంచి సంగం వెళుతున్న టిప్పర్ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. తిరుపతి జిల్లా ఏర్పేడు నుంచి సంగం వెళుతున్న ఖాళీ టిప్పర్ సిద్ధవరం సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది.

చలో తిరుపతికి తరలిరండి

కోట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 23వ తేదీన తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగసభను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కోటలో కరపత్రాలు పంపిణీ చేశారు. జేఏసీ చైర్మన్ తాళ్లపాక రాము,శ్రీనివాసరావు, మీజూరు మాధవ్, జయచంద్ర,అశోక్‌కాంబ్లి, మల్లికార్జున్, హేమంత్, కేశవ పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

సైదాపురం: ఆరేళ్లలోపు వయసు కలిగిన చిన్నారులకు కలువాయి మండలంలో స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భవాని తెలిపారు. ఆమె మాట్లాడుతూ కలువాయి మండలంలో 15 గ్రామ సచివాలయాల్లో స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. 5 నుండి 15 సంవత్సరాలు వయసు కలిగిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలియజేశారు. క్యాంపులు 28వ తేదీ వరకు ఉంటాయన్నారు.

గిరీశ్వరుని హుండీ లెక్కింపు

దక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయంలో భక్తులు హుండీ ద్వారా రూ.9,15,712 సమర్పించినట్లు ఈఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆలయంలో స్వామివారి హుండీ కానుకలను లెక్కించారు. గూడూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస బాబు పర్యవేక్షించారు.

పందెం రాయుళ్ల అరెస్టు

రాపూరు: సైదాదుపల్లి అడవుల్లో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. ఈ దాడుల్లో 11 మంది పందెంరాయుళ్లను, 11 సెల్‌ఫోన్లు, 13 మోటారు బైక్‌లు, రూ.6,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మల్లాం ఆలయంలో విశేష పూజలు



అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లు

చిట్టమూరు: మల్లాం గ్రామంలో స్వయంభువుగా కొలువైయున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకాలను ఆలయ అర్చకులు మూలంరాజు భానుప్రకాష్‌శర్మ నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. కుజదోషం ఉన్న వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి హోమాలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం కనుల పండువగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి వరదయ్యపాళెంకు చెందిన చెంచురత్నం శెట్టి, శారదమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం దేవస్థానంవారు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ వైఖరి మారాలి



డిపో ఎదుట ఎన్‌ఎంయూ నిరసన

గూడూరు రూరల్: గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైఖరిని మార్చుకోవాలని నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట గేట్ వద్ద మంగళవారం ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గూడూరు డిపో మేనేజర్ కార్మికులతో దురుసుగా వ్యవహరిస్తున్నారని ఈ పద్ధతి మార్చుకోవాలని కోరారు. యూనియన్‌లతో పక్షపాత వైఖరిని అవలంబిస్తున్న డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక సంఘ నాయకులు భాషా, శ్రీనివాసులు, వెంకటయ్య, గౌస్, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్జిన్ లేని రోడ్డు

– సీసీ రోడ్డు వేశారు.. మార్జిన్ వదల్లేదు



మార్జిన్ వేయకుండా వదిలేసిన రోడ్డు



కరెంట్ స్తంభాలు తీయకుండానే వేసిన సీసీ రోడ్డు

సైదాపురం: కోట్లాది రూపాయల నిధులతో రోడ్డు వేశారు. అయితే రోడ్డుకు ఇరువైపులా ఉన్న మార్జిన్‌కు మట్టి వేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలోనే ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఉన్నాయి. అయితే ఆ కార్యాలయాలకు పోలేకపోతున్నారు. ఈ సంఘటన మండల కేంద్రమైన సైదాపురంలో నెలకొంది. సైదాపురంలోని పొదలకూరు రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సీసీ రోడ్డును ఇటీవలన ఓ కాంట్రాక్టర్ వేశారు. రోడ్డు వేశారు కాని రోడ్డుకు ఇరువైపులా ఒక్క సైడ్ మాత్రమే మార్జిన్‌కు నామమాత్రంగానే మట్టిని వేశారు. రెండో వైపు మార్జిన్‌కు వేయకపోవడంతో రోడ్డు ఎక్కాలన్నా... దిగాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. మార్జిన్ వేయకపోవడంతో రోడ్డు మీదనే వాహనాలను నిలబెట్టుతున్నారు. విద్యుత్, ఎంఈఓ, పశు వైద్యశాలలకు పోవాలంటేనే రెండు అడుగుల మేరకు దిగి పోవాల్సి వస్తోంది. వాహనాలు మరో చోట పెట్టి కార్యాలయాలకు చేరుకుంటున్నారు. దీనికి తోడు పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మార్జిన్ వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు

చిట్టమూరు: మండల పరిధిలోని ఎల్లసిరి గ్రామ సమీపంలోని బండాగుంట గిరిజన కాలనీకి వెళ్లే దారిలో చెరువు కట్ట వెంబడి ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించినట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వారు ఈ ప్రాంతంలో కూల్‌డ్రింక్ షాపు నిర్వహించేందుకు షెడ్డు నిర్మాణం చేట్టారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ భూమి ఆక్రమించడంతో పొలాల్లోకి వెళ్లే దారి లేకుండా పోయిందన్నారు. పొలాల్లోకి ఎరువులు తీసుకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారింది. ఈ షెడ్డుకువిద్యుత్ శాఖ అధికారులు సర్వీసు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయంపై ఇరిగేషన్ శాఖ ఏఈ లీలామోహన్‌ను వివరణ కోరగా తమకు గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. మండల సర్వేయర్‌తో సర్వే నిర్వహించి, తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్ శాఖ ఏఈ పోలయ్య మాట్లాడుతూ కరెంట్ సర్వీసు కావాలని తమకు ఎటువంటి దరఖాస్తు రాలేదని తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులు ధరించిన విద్యార్థులు

చిట్టమూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రధానోపాధ్యాయిని కె.మీనా కుమారి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. తడ శ్రీసిటీలోని మాండలేజ్ మ్యాజిక్ బస్ సంస్థ ఆర్థిక సాయంతో దుస్తులు అందజేసినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. ఈ సంస్థ తమ పాఠశాలను దత్తత తీసుకుని విద్యార్థులకు కబడ్డీ క్రీడలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. చదువుతోపాటు జిల్లా, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. కబడ్డీ కోచ్‌లు చైతన్య, మనోజ్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పిడుగు భరత్ మహీపతి పాల్గొన్నారు.

జీవం.. నిర్జీవం



సైదాపురం: పక్కపక్కనే రెండు రకాల చెట్లు వింతగొలుపుతున్నాయి. ఓ చెట్టు ఆకులన్నీ రాలిపోయి జీవం కోల్పోయినట్లు కన్పిస్తోంది. మరో చెట్టు పూలు విరబూసి చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రం మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కనువిందు చేస్తోంది.



వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి మృతికి నివాళి



చిల్లకూరు: వైఎస్సార్ సీపీ నేత వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతి చెందడంతో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



అత్తలపాళెంలో రైతులకు భూ పత్రాలు అందిస్తున్న తహశీల్దార్

నాయుడుపేట టౌన్: భూ సమస్యలు సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ మాగర్ల రాజేంద్ర వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అత్తలపాళెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీ సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. రీసర్వే పూర్తయిన సందర్భంగా మంగళవారం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో మొత్తం 718.16 ఎకరాల భూములను మూడు టీములుగా రీ సర్వే జరిపినట్లు సర్వేయర్ చరణ్ వివరించారు. ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల పేర్లను రికార్డులలో నమోదు చేసి గ్రామ సభలో పేర్లు వెల్లడించినట్లు డివిజనల్ సర్వేయర్ హరోంహర తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి



అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ రవీంద్రబాబు

పెళ్లకూరు: నివాసాల మధ్య చెత్త, చెదారాలు లేకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ రవీంద్రబాబు గ్రామస్తులకు సూచించారు. మంగళవారం తాళ్వాయిపాడు గ్రామంలో పర్యటించిన ఆయన గ్రామంలో ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్తతో సంపద తయారీ కేంద్రాల్లో వర్మికంపోస్టును తయారు చేసుకొని రైతులకు విక్రయిస్తే ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పింక్ బస్సు సేవలు వినియోగించుకోండి



నోటి క్యాన్సర్‌కు పరీక్షలు

చిల్లకూరు: ప్రభుత్వం క్యాన్సర్‌ను గుర్తించేందుకు గ్రామాలలో స్క్రీనింగ్ టెస్టులు చేసేలా పింక్ బస్సును ఏర్పాటు చేసిందని, ఈ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని చిల్లకూరు వైద్యుడు అరాఫత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన చిల్లకూరులో మంగళవారం తిరుపతికి చెందిన స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్విమ్స్ వైద్యులు చైతన్య భాను పర్యవేక్షణలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్‌లు రవికుమార్, మునిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొండాపురంలో..

వాకాడు: బాలిరెడ్డిపాళెం పీహెచ్‌సీ పరిధిలోని కొండాపురం గ్రామంలో మంగళవారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు బి.రంగదీప్తి మాట్లాడుతూ కొండాపురం గ్రామంలో దాదాపు 50 మందికి పైగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను, హరిత పాల్గొన్నారు.

గరుడినిపై శ్రీలక్ష్మీనరసింహుడు





స్వాతి నక్షత్రం సందర్భంగా శాంతిహోమం, స్వర్ణ గరుడ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహుడు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి చందనాలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. మంగళవారం స్వాతి శ్రీవారి జన్మ నక్షత్రం కావడంతో స్వామివారిని చందనంతో అలంకరించినట్లు దేవస్థాన ప్రధానార్చకులు తెలిపారు. ఉదయం అభిషేకం, చందన అలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, 1 గంటకు అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శ్రీవారికి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కోన మాడవీధుల్లో వైభవంగా ఊరేగించారు.

ఆక్రమణలకు గురికాకుండా చర్యలు



పాత ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, వైద్యులు, నేతలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలోని కోట్లాది రూపాయలు విలువచేసే ఆస్పత్రి భవనంతో పాటు ఖాళీ స్థలం కబ్జా కాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ పురుషోత్తంశివకుమార్ తెలిపారు. సైదాపురంలోని పాత పీహెచ్‌సీ భవనంతోపాటు ఖాళీ స్థలాన్ని మంగళవారం ప్రజాప్రతినిధులతోపాటు వైద్యులు సందర్శించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆస్పత్రిని నూతన భవనంలోకి మార్చడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఆస్పత్రి భవనం నిరుపయోగంగా కాకుండా ఉండేందుకు ఆ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలం కూడా ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు కూడా కార్యాచరణ తయారుచేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సీహెచ్ పోలయ్య ఉన్నారు.

24న బహిరంగ వేలం పాట

వెంకటగిరి రూరల్: కూరగాయల మార్కెట్, మున్సిపల్ సరిహద్దు రోడ్డు మార్జిన్లు, చేపలు, మాంసం మార్కెట్, జంతు వధశాలలకు సంబంధించి నగదు వసూలు చేయుటకు ఈ నెల 24వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు ధరావత్తు నగదు చెల్లించి అనుమతి పొందాలని తెలియజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 8 చేపల చెరువులకు సంబంధించి, బందెలదొడ్డి వీధిలోని ప్రభుత్వ వైద్యశాల పక్కనే ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 13 గదులను అద్దె లీజుకు ఇచ్చుటకు 25వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. చేపల చెరువులకు, గదులకు వేర్వేరుగా రూ.5వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. పాటలో పాల్గొనదలచిన వారు సాల్వెన్సీ ధ్రువపత్రం 22వ తేదీ సాయంత్రంలోగా కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు.

తైక్వాండో క్రీడాకారిణికి సత్కారం



దీపికను సత్కరిస్తున్న 786 రఫీ తదితరులు

నాయుడుపేట టౌన్: అస్మితా ఖేలో ఇండియా సారధ్యంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీలలో నాయుడుపేటకు చెందిన క్రీడాకారిణి బి.దీపిక ప్రథమ స్థానంలో నిలిచి పతకం సాధించినట్లు కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జూనియర్ అండర్-13 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. జూన్‌లో జరగనున్న సౌత్ జోన్ తైక్వాండో పోటీలకు దీపిక అర్హత సాధించినట్లు వెల్లడించారు. 786 కార్యాలయంలో మంగళవారం దీపికను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ తైక్వాండో జెర్సీ బహూకరించి సత్కరించారు. కోచ్‌లు యు.పవన్‌కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.